
జీడిమెట్ల డివిజన్‌లో ఎన్నికల ప్రచారంలో కార్యకర్తలతో కలిసి పాదయాత్ర చేస్తున్న కూన శ్రీశైలంగౌడ్


హెచ్‌ఏఎల్ కాలనీలో జరిగిన బీజేపీ-జనసేన ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న కూన శ్రీశైలంగౌడ్


హెచ్‌ఏఎల్ కాలనీలో జరిగిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కూన శ్రీశైలంగౌడ్, బీజేపీ నాయకుడు మల్లారెడ్డి


సూపర్‌మాక్స్ కార్మికులకు సంఘీభావం తెలుపుతున్న కూన శ్రీశైలంగౌడ్

బీజేపీతోనే సామాజిక తెలంగాణ సాధ్యం

● కుత్బుల్లాపూర్ బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్


ఎన్నికల ప్రచారంలో భాగంగా బస్తీ కమిటీ సభ్యులతో సమావేశమైన కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినా తెలంగాణ ప్రజలకు గడీల పాలనలో మగ్గుతున్నారని.. బీజేపీతోనే సామాజిక తెలంగాణ సాధ్యపడుతుందని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ కుత్బుల్లాపూర్ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో శ్రీశైలంగౌడ్ విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జీడిమెట్ల డివిజన్ బీరప్పనగర్‌లో పర్యటించిన ఆయనకు బస్తీ వాసులు బ్రహ్మరథం పట్టారు. శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ స్థానికంగా అభివృద్ధిని ఆకాంక్షించే ప్రతి ఒక్కరూ తనకు మద్దతు తెలిపి కమలం గుర్తుపై ఓటేసి తనను గెలిపించాలన్నారు.

సంక్షేమ పథకాల్లో బీఆర్‌ఎస్ వాళ్లకే లబ్ధి..

◆ గాజులరామారం డివిజన్ హెచ్‌ఏఎల్ కాలనీలో జరిగిన బీజేపీ-జనసేన ఆత్మీయ సమావేశానికి కూన శ్రీశైలంగౌడ్ హాజరయ్యారు. వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థి శ్రీశైలంగౌడ్ విజయానికి కలిసికట్టుగా పని చేస్తామని బీజేపీ, జనసేన నాయకులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ... తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో బస్తీలు, కాలనీల అభివృద్ధి కుంటు పడిందన్నారు. సంక్షేమ పథకాల్లో సైతం బీఆర్ఎస్ కార్యకర్తలే లబ్ధి పొందారని ఆరోపించారు. తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు హెచ్‌ఏఎల్ కాలనీవాసులు బీజేపీలో చేరారు.

సూపర్‌మ్యాక్స్ కార్మికుల దీక్షకు మద్దతు...

◆ జీడిమెట్ల సూపర్‌మ్యాక్స్ పరిశ్రమ ముందు రిలే నిరాహార దీక్ష చేస్తున్న కార్మికులకు బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్ సంఘీభావం తెలిపారు. తాను అధికారంలోకి ఉన్నా లేకున్నా కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేశానని, వచ్చే ఎన్నికల్లో తనను గెలిపిస్తే యాజమాన్యంతో మాట్లాడి జీతాలు ఇచ్చేలా కృషి చేస్తానన్నారు. స్థానిక ఎమ్మెల్యేకు ప్రజా సమస్యలు పట్టవని, అతన్ని నమ్మి మరోమారు మోసపోవద్దన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కాపు సంఘం నాయకులు దుర్గారావు, పుప్పాల మధు

కూన శ్రీశైలంగౌడ్‌కు కాపు సేవా సమితి మద్దతు...

◆ కాపులంతా ఏకమైన బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని కాపు సేవా సమితి నాయకులు దుర్గారావు, పుప్పాల మధు లు అన్నారు. గురువారం గాజులరామారంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... కాపు కులస్తులంతా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్‌ను గెలిపించి ఆయనకు కానుకగా ఇస్తామన్నారు.

కాపులకు స్థలం ఇస్తామని మోసం...

◆ కాపులకు స్థలం కేటాయిస్తామని చెప్పి మోసం చేసిన బీఆర్ఎస్ పార్టీకి కాపులంతా ఏకమై గుణపాఠం చెబుతామన్నారు.


బీరప్పనగర్‌లో పర్యటిస్తున్న బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్

నేడు స్ట్రీట్ కార్నర్ సమావేశాలు

బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారంలో భాగంగా స్ట్రీట్ కార్నర్ సమావేశాలు నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు దూలపల్లి, 11గంటలకు చంద్రగిరినగర్, సాయంత్రం 5గంటలకు సూరారం కాలనీ బస్టాప్, సాయిబాబానగర్‌లలో జరిగే ఎన్నికల సభల్లో బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్‌తో కలిసి పాల్గొననున్నారు.

ఇంటింటికీ ఓటర్ స్లిప్‌ల పంపిణీ

కుత్బుల్లాపూర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పులి సైదులు



కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఓటర్లకు ఈనెల 16 నుంచి 21వ తేదీ వరకు ఓటర్ స్లిప్‌లను పంపిణీ చేయనున్నామని కుత్బుల్లాపూర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పులి సైదులు తెలిపారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ఓటర్లకు బూత్‌స్థాయి అధికారులతో ఓటర్ స్లిప్‌ల పంపిణీ జరుగుతుందన్నారు. దుండిగల్ మండల పరిధిలో 46,924 మంది పురుషులు, 43,487 మంది మహిళలు మొత్తం 90వేల 423 ఓటర్లు, అదే విధంగా బాచుపల్లి మండల పరిధిలో 71,749 పురుష, 62,911 మహిళలు మొత్తం 1,34,676 మంది ఓటర్లు ఉండగా, కుత్బుల్లాపూర్ మండలంలో 2,47,987 పురుషులు, 2,25,825 మంది మహిళలు మొత్తం 4,73,943 ఓటర్లుగా నమోదై ఉన్నారని పేర్కొన్నారు. ఓటర్ లిస్ట్‌లో ఉన్నవారి వివరాలను ఆయా పార్టీల అధ్యక్ష, కార్యదర్శులు, ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులకు అందించనున్నామన్నారు. ఐదు రోజుల పాటు కొనసాగే ఓటర్ స్లిప్‌ల పంపిణీలో బూత్‌స్థాయి ఏజెంట్లు, ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల ఏజెంట్లు అధికారులతో కలిసి పాల్గొనవచ్చని సైదులు స్పష్టం చేశారు.

19 నుంచి ఎలక్షన్ ఎక్స్‌పెండిచర్‌పై ఇన్‌స్పెక్షన్

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గానికి పోటీ చేయనున్న ఎమ్మెల్యే అభ్యర్థుల రోజువారి ఎన్నికల ప్రచార ఖర్చులను నమోదు చేయు రిజిస్టార్‌ను ఎలక్షన్ ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్ ఇన్‌స్పెక్షన్ చేయనున్నారు. ఎన్నికల అబ్జర్వర్ ఆదేశాల ఈ నెల 19, 23, 27వ తేదీల్లో ఉదయం 10గంటలకు కుత్బుల్లాపూర్ రిటర్నింగ్ కార్యాలయంలో ఇన్‌స్పెక్షన్ ఉంటుందని ఎన్నికల అధికారి పులి సైదులు ఓ ప్రకటనలో తెలియజేశారు.

పిల్లలను తీర్చిదిద్దడంలో తల్లుల పాత్ర కీలకం

చిక్కడపల్లి: పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడంతో తల్లుల పాత్ర కీలకమని ప్రముఖ సినీగేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ అన్నారు. జగతి ఆర్ట్స్ ఆధ్వర్యంలో గురువారం త్యాగరాయ గానసభ ప్రధాన వేదికలో చిల్డ్రన్స్ ఫెస్ట్- 2023 శీర్షికతో నిర్వహించిన చిల్డ్రన్స్ డే వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భం మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులన్నారు. ఫెస్ట్‌లో భాగంగా చిన్నారుల నృత్యప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

హలో డాక్టర్.. డ్యూటీకి రారా?

● 20 రోజులుగా విధులకు గైర్హాజరు ● నర్సులతోనే పనులు చేయిస్తున్న వైనం
● బస్తీ దవాఖానాలు ఉండి ఏం లాభమంటున్న స్థానికులు

రంగారెడ్డినగర్: బస్తీ ప్రజల దరికి వైద్య సేవలను చేర్చాలన్న లక్ష్యంతో జీహెచ్ఎంసీ పరిధిలో ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాల్లో వాస్తవ పరిస్థితుల్లో అందుకు భిన్నంగా ఉంటున్నాయి. చాలా బస్తీ దవాఖానాల్లో వైద్యులు లేకపోవడం, ఒక వేళ ఉన్నా సరైన సమయానికి డ్యూటీలకు రాకపోవడం, ఒక్కోసారి డుమ్మాలు కొట్టి నర్సులతోనే సేవలు చేయిస్తున్నారు.

◆ రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి రంగారెడ్డినగర్, నందానగర్‌లోని కమిటీ హాలు లో బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేశారు. కాగా నందానగర్ బస్తీ దవాఖానా వైద్యుడు గత 20 రోజులకు విధులకు హాజరు కావడం లేదు. ప్రతిరోజు నందానగర్, మారుతినగర్, విజయనగర్‌కాలనీ, గాంధీనగర్, వెంకట్రామిరెడ్డినగర్, నెహ్రూనగర్, సంజీవ్‌గాంధీనగర్ తదితర బస్తీలకు చెందిన 70–80 మంది రోగులు నందానగర్‌లోని బస్తీ దవాఖానాకు వివిధ అనారోగ్య సమస్యలతో వస్తుంటారు.

◆ వైద్యుడు అందుబాటులో లేకపోవడంతో నర్సు వైద్య సేవలు అందిస్తున్నారు. రోగుల తాకిడి ఎక్కువగా ఉంటే సమీపంలోని రంగారెడ్డినగర్ బస్తీదవాఖానా, షాపూర్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లాల్సిందిగా సిఫార్స్ చేస్తున్నారు. దీంతో సుదూర ప్రాంతాలకు వెళ్లలేని వారు స్థానికంగా ఉన్న ఆర్ఎంపీ, పీఎంపీలను ఆశ్రయించాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు.


నందానగర్‌లోని బస్తీ దవాఖానా

◆ ఇదే విషయాన్ని 'సాక్షి'మండల వైద్యాధికారి డాక్టర్ నిర్మలను వివరణ కోరగా నందానగర్‌లో విధులు నిర్వహిస్తున్న వైద్యుడికి పీజీ సీటు రావడంతో ఉన్నత చదువుల కోసం రిజైన్ చేశారని.. ఎన్నికల పూర్తయిన తరువాతనే కొత్త డాక్టర్ వస్తారని చెప్పారు. దీంతో ఎన్నికల తతంగం పూర్తయ్యేంత వరకు దాదాపు మరో నెల రోజుల పాటు నందానగర్ పరిసర బస్తీల వాసులకు వైద్యసేవల తిప్పలు తప్పేతట్టే లేవు.

19న పుస్తకావిష్కరణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రముఖ రచయిత డాక్టర్ జెల్ది విద్యాధర్ కవితా సంపుటి తోటమాలి మాలిమి ఆవిష్కరణ కార్యక్రమం ఈ నెల 19న ఆదివారం సా.6 గం విమల సాహితీ సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు రచయిత తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పద్మశ్రీ కొలకలూ రి ఇనాక్, బిక్కి కృష్ణ, ఎమ్మెల్సీ గోరెటి వెంకన్న, ప్రముఖ కవి కోయి కోటేశ్వర్‌రావు, ప్రొఫెసర్ జి.వి.రత్నాకర్ హాజరుకానున్నారన్నారు.

సైఫాబాద్ సైన్స్ కాలేజీలో ఇండక్షన్ ప్రోగ్రామ్

బంజారాహిల్స్: యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ సైఫాబాద్‌లో పీజీ విద్యార్థులకు గురువారం ఇండక్షన్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఓయూ జెనిటిక్స్ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ కవి కిషోర్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. యూజీసీ, ఓయూ ఇచ్చిన ఆదేశాల ప్రకారం ఈ కార్యక్రమాలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కరోనా తర్వాత ప్రజల్లో సైన్స్ మీద చాలా అవగాహన వచ్చిందని అలాగే ఔషధ మొక్కలపై కూడా ఆలోచించే స్థాయికి ఎదిగారన్నారు. మెడికల్ ప్లాంట్స్‌తో ఎన్నో రోగాలు నయం చేయగలమన్నారు.

నిత్యాన్నదానం ప్రారంభం

దుండిగల్: దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేటలోని అశ్రిత వత్సల హరిహర పుత్ర అయ్యప్పస్వామి దేవాలయంలో నిత్యాన్నదాన కార్యక్రమం ప్రారంభమైంది. అయ్యప్ప స్వాములకు, భక్తులకు ప్రతి రోజు మధ్యాహ్నం అన్నదానం నిర్వహిస్తున్నారు. గురువారం కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నదాన దాతగా నిలిచారు. ఈ సందర్భంగా డి.పో చంపల్లి కౌన్సిలర్ రాముగౌడ్‌ను ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు.


రాముగౌడ్‌ను సత్కరిస్తున్న ఆలయ కమిటీ

మత్తు వదలరా.. లేక జారి పడుదువురా!

మొబైల్ మైకం..



నేటి యువత మొబైల్ ఫోన్‌లో గేమ్స్ ఆడటానికి బానిసలు అవుతున్నారు అనడానికి ఈ చిత్రమే నిదర్శనంగా చెప్పుకోవచ్చు. గాజులరామారం డివిజన్ మెట్టుకానిగూడలోని గ్రౌండ్‌లో ఓ యువకుడు చెట్టుపై దర్జాగా కూర్చుని ఈ లోకాన్ని మరిచినట్టు సెల్‌ఫోన్‌లో సీరియస్ గేమ్ ఆడుతున్న దృశ్యాన్ని 'సాక్షి'కెమెరా క్లిక్‌మనిపించింది. ఆ యువకుడు చుట్టూ ప్రపంచాన్ని మరచి మరి చెట్టుపై ఎక్కి గంటల తరబడి సెల్‌ఫోన్ వాడుతున్నాడు. నేటి యువత అధికంగా మొబైల్ వాడుతూ విలువైన సమయాన్ని కోల్పోవడమే కాకుండా, అనారోగ్యాల బారిన పడుతున్నారు. ఇలాంటి యువకులు ఇళ్ల నుంచి బయటకు వెళ్లేటప్పుడు వీరిపై తల్లిదండ్రులు కాస్తా దృష్టి సారించాల్సిన విషయం ఎంతైనా ఉంది.

– సుభాష్‌నగర్

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించడమే లక్ష్యం



దుండిగల్: విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించడమే తమ లక్ష్యమని బౌరంపేటలోని ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ బల్జీత్ ఒబెరాయ్ అన్నారు. జూలై నెలలో న్యూయార్క్‌లో జరిగిన ఎస్ఏఈ-యూనిసెఫ్ సమ్మిట్‌లో ఇషాంక, శశాంక్ అనే విద్యార్థులు పాల్గొన్నారు. పాఠశాలలో గురువారం సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్‌పై సమ్మిట్ నిర్వహించారు.

◆ ఈ సందర్భంగా విద్యార్థులు తమ అనుభవాలను పంచుకున్నారు. న్యూయార్క్ సదస్సులో పాల్గొనడం ద్వారా తమలో ఆత్మవిశ్వాసం మరింత పెరిగిందన్నారు. అభ్యాసన అనుభవాలను వ్యాప్తి చేస్తున్నామన్నారు.

◆ అనంతరం బల్జీత్ ఒబెరాయ్ మాట్లాడుతూ.. 2015లో ఐక్యరాజ్య సమితి ఆమోదించిన ఎస్‌డీజీ అందరికి స్థిరమైన, సమానమైన భవిష్యత్తును సృష్టించే విధంగా 17 లక్ష్యాలతో ఏర్పడిందన్నారు. విద్యార్థులకు వాటి గురించి అవగాహన కల్పించేందుకు, నైపుణ్యం,జ్ఞానం పెంపొందించేందుకు ఇది చక్కటి వేదిక అన్నారు. కార్యక్రమంలో పాఠశాల సీఏఎస్ కో ఆర్డినేటర్ ఫియోనా, విద్యార్థులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్: విద్యుత్ మరమ్మతుల కారణంగా కొంపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2.30 వరకు కేవీఆర్ ఫంక్షన్‌హాల్ వీధి, విజయశాంతి ఎన్‌క్లేవ్, శివారెడ్డి గోదాం, ఎన్‌సీఎల్ నార్త్, ఎన్‌సీఎల్ స్విమ్మింగ్ పూల్స్, సాయిబాబా గుడి, ప్రజయ్ అపార్ట్‌మెంట్స్, మనభూమి ఎన్‌క్లేవ్, వెన్‌సాయి అపార్ట్‌మెంట్ తదితర ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

మీనాక్షి, జీడిమెట్ల ఫీడర్ల పరిధిలో...

కుత్బుల్లాపూర్: విద్యుత్ ఫీడర్ల నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలునుందని పేట్‌బషీరాబాద్ ఏఈ జ్ఞానేశ్ ఓ ప్రకటనలో తెలియజేశారు.

◆ 11కేవీ మీనాక్షి ఫీడర్ పరిధిలోని స్ప్రింగ్ ఫీల్డ్ కాలనీ, ఓమ్ బుక్స్, మీనాక్షి ఎస్టేట్స్, అంగడిపేట్, మెట్రో వెనుక గల్లీ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు..

◆ 11కేవీ జీడిమెట్ల ఫీడర్ పరిధిలోని భీమా డెవలపర్స్, గ్రీన్ పార్క్, జీడిమెట్ల ప్రధాన రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఫ్లైఓవర్ పనుల నేపథ్యంలో....

నిజాంపేట్: బాచుపల్లి ఫ్లైఓవర్ పనుల నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో ఆటంకం ఏర్పడనుందని బాచుపల్లి ఏఈ శాంతకుమార్ ఓ ప్రకటనలో తెలియజేశారు. 11కేవీ నిజాంపేట్, ఎస్ఎంఎస్, ఎస్ఎల్‌జీ ఫీడర్ల పరిధిలో... బాచుపల్లి సిగ్నల్ నుంచి శిఖర విల్లాస్ మెయిన్ రోడ్డు వరకు ఉన్న ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వృద్ధుడి మృతి



కుత్బుల్లాపూర్: ఫిట్స్ వచ్చిన ఓ వృద్ధుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 10వ తేదీన దేవరయాంజల్ వద్ద ఓ గుర్తు తెలియని వృద్ధుడు (70) ఫిట్స్ వచ్చి కిందపడిపోయాడు. ఇది గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. అనారోగ్య కారణాలతోనే మృతి చెంది ఉంటాడని పోలీసులు తెలిపారు. అతని ఆచూకీ తెలిస్తే పేట్‌బషీరాబాద్ పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

కుత్బుల్లాపూర్‌కు మెట్రో తెప్పిస్తా

● కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఎన్నికల రోడ్ షో
● వివేకానంద్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థన
● భారీగా హాజరైన కార్యకర్తలు, ప్రజలు

ఐటీ, పురపాలకశాఖ మంత్రి కేటీఆర్

చింతల్/సుభాష్‌నగర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో అనేక సౌకర్యాలు కల్పించామని ఎన్నికల ప్రచార రోడ్ షోలో ఐటీశాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. కాకపోతో నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉందన్నారు. అందు కోసం కొత్త ఫ్లైఓవర్లు నిర్మించాలన్నారు. అదేవిధంగా కుత్బుల్లాపూర్‌కు మెట్రో రైల్ సర్వీసును తీసుకువచ్చే జిమ్మేదారి తనదేనంటూ హామీ ఇచ్చారు. ఇవ్వన్నీ కావాలంటే మరోసారి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

అభివృద్ధి రజినీకి అర్థమైనా ఇక్కడి గజినీలకు అర్థమైతలే...

డ్రైనేజీ సిస్టం ఇంప్రూవ్‌మెంట్ కోసం స్టేటస్ ప్రోగ్రాం ద్వారా, ఎస్ఎన్‌డిపి సిస్టం ద్వారా ఫ్లడ్ మేనేజ్మెంట్ సిస్టర్ ని అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా కృషి చేస్తామని అన్నారు. ఎన్నివేల కోట్ల వరకు ఖర్చయినా సరే డ్రైనేజీ సిస్టం బ్రహ్మాండంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. హైదరాబాద్ అందరికీ అమ్మ లాంటిదని లక్షలాదిమందికి ఆశ్రయము మనందరం కాపాడుకోవాలని అన్నారు. కేసీఆర్ నాయకత్వంలో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తున్నామని అన్నారు. హైదరాబాద్ అభివృద్ధి చెన్నై నుంచి వచ్చిన సూపర్ స్టార్ రజనీకాంత్‌కు అర్థమైనా హైదరాబాద్‌లో ఉండే గజినీలకు, ప్రతిపక్ష నాయకులకు అర్థమైతే లేదని విమర్శించారు.

హామీల వర్షం...

కేసీఆర్‌ఆర్ మూడోసారి ముఖ్యమంత్రి అయిన తర్వాత 18 సంవత్సరాలు నిండిన ఆడబిడ్డలకు 3వేల ఖాతాలో జమ చేస్తామని అన్నారు. ఆసరా పెన్షన్లను ఐదువేల రూపాయలకు పెన్షన్ ఉన్నట్లు అన్నారు. తెల్ల రేషన్ కార్డు ఉండే ప్రతి కుటుంబానికి అన్నపూర్ణ పథకం ద్వారా సన్నబియ్యాన్ని ఉన్నట్లు తెలిపారు. తెల్ల కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి కేసీఆర్ బీమా ప్రవేశ పెట్టినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్పొరేటర్లు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హనుమంత్‌రెడ్డి కాదు 'వన్ మంత్ రెడ్డి'

కాంగ్రెస్ అభ్యర్థి కొలన్ హనుమంత్‌రెడ్డిపై మంత్రి విమర్శలు గుప్పించారు. కొలను హనుమంత్‌రెడ్డిని 'వన్ మంత్ రెడ్డి' అంటూ విమర్శించారు. ఎలక్షన్లప్పుడు కనబడే 'వన్ మంత్ రెడ్డి' మిగతా సమయంలో కనిపించకుండా పోతాడన్నారు. అదేవిధంగా రేవంత్‌రెడ్డిని రేటెంత రెడ్డి? అని, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని సీట్లు అమ్ముకునే నాయకుల చేతుల్లో రాష్ట్రాన్ని పెడదామా అంటూ ప్రశ్నించారు. కాంగ్రెస్ వాళ్లు వచ్చి పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నారని అన్నారు. రాహుల్ గాంధీ మాకు ఒక్క చాన్స్ ఇవ్వమని అడుగుతున్నారని... ఒక చాన్స్ కాదు 11 చాన్సులు ఇవ్వడంతో దేశాన్ని దరిద్రంలోకి నెట్టిందని విమర్శించారు.

కాంగ్రెస్ కావాలా.. కరెంటు కావాలా?

కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు జీడిమెట్లలో వారానికి మూడు రోజులు పవర్ హాలిడే ఉండేదని అటువంటి వారిగా తెలంగాణ రాష్ట్రాన్ని అప్పగించేదన్నారు. తెలంగాణ హయాంలో పవర్ హాలిడే లేకుండా పోయిందని ఇప్పుడు జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ కావాలా కరెంటు కావాలా మీరే ఆలోచించాలి అని అన్నారు.






నమూన బ్యాలెట్‌ను చూపించి వివేకానంద్‌కు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థిస్తున్న కేటీఆర్


ఎమ్మెల్యేకు మద్దతు తెలుపుతున్న గార్మెంట్స్ అసోసియేషన్


బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ నాయకుడు బిజిలి సాంబయ్య


ఏకగ్రీవ తీర్మాన పత్రాన్ని అందజేస్తున్న ఆల్‌హక్ ముస్లిం వెల్ఫేర్

యువకులకు క్రికెట్ కిట్ అందజేత

సుభాష్‌నగర్: ఆటపాటలపై ఆసక్తి ఉన్నవారికి తన ప్రోత్సాహం ఉంటుందని ఎస్పీఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ అండ్ చైర్మన్ సొంటిరెడ్డి పున్నారెడ్డి అన్నారు. జగద్గిరిగుట్ట డివిజన్ శ్రీనివాస్‌నగర్‌కు చెందిన యువకులకు గురువారం క్రికెట్ కిట్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ మైనారిటీ ప్రెసిడెంట్ లాల్ మహమ్మద్, మైనార్టీ వైస్ ప్రెసిడెంట్ ఆబిద్, బి-బ్లాక్ మహిళా అధ్యక్షురాలు సొంటి రెడ్డి చైతన్య, ట్రస్ట్ మెంబర్ దండే రాజు, పున్నన్న అభిమాన సంఘం అధ్యక్షుడు రాజ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు విశాల్ అన్వర్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.


యువతకు క్రికెట్ కిట్‌ను అందజేస్తున్న సొంటిరెడ్డి పున్నారెడ్డి

వనభోజన పోస్టర్ ఆవిష్కరణ

చింతల్: కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ఈనెల 19న శెట్టిబలిజ వనభోజనాల కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆ సంఘం నేతలు పేర్కొన్నారు. హెచ్ఎంటీ కాలనీలోని వెంకటేశ్వర స్వామి ఆలయ పక్కన ఉన్న హరిహర కల్యాణ మండపంలో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ఉదయం 9గంటల నుంచి ఐకమత్యపు వనభోజన కార్యక్రమాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. అదే విధంగా సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు ఉంటాయన్నారు. అనంతరం బహుమతులను అందజేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వనభోజన కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శెట్టిబలిజ సంక్షేమ సంఘం అధ్యక్ష కార్యదర్శులు, సంఘం నేతలు పాల్గొన్నారు.


శెట్టిబలిజ వనభోజన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘం ప్రతినిధులు